రామ్‌నగర్‌లో పందుల బెడద



రామ్‌నగర్ గెడ్డలో సంచరిస్తున్న పందులు



సర్వీసు రోడ్డు పక్కన సేద తీరుతున్న పందుల గుంపు

● స్థానికుల ఆందోళన

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు రామ్‌నగర్ ప్రాంతంలో పందుల బెడద రోజు రోజుకూ అధికమవుతోంది. ఈ సమస్యపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రామ్‌నగర్ ప్రాంతంలోని గెడ్డలో పదుల సంఖ్యలో పందులు సంచరిస్తూ పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయి. సర్వీసురోడ్డు,పలు ఇళ్ల ముందు సేద తీరుతూ అక్కడ వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. సమస్యను కాలనీ వాసులు అధికారులకు వివరించారు. అయినా స్పందన లేదని ఈ ప్రాంతానికి చెందిన పిల్లా భాస్కరరావు తదితరులు ఆరోపించారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించక పోతే జీవీఎంసీ కమిషనర్,మేయర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

క్లుప్తంగా

విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలి



సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కార్పొరేటర్ సురేష్

మల్కాపురం: తల్లిదండ్రులు చెప్పే మంచిని గ్రహించి, శ్రద్ధగా చదువుకుని ఉన్నతులుగా మెలగాలని 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్ అన్నారు. వార్డు పరిధిలోని ఎస్.వి.ఎల్.ఆర్.కే పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌ను ఆయన ప్రారంభించారు. ఇలాంటి ప్రదర్శనలు విద్యార్థుల మేధాశక్తిని పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీతంరాజుకే మా మద్దతు

● ఏపీ టీచర్స్ యూనియన్

విశాఖ విద్య: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వాదంతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు ఏపీ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై.దేముడు, జి.దత్తాత్రేయశర్మ శుక్రవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్, నిరుద్యోగ సమస్యలను ఎమ్మెల్సీగా గెలిస్తే సీతంరాజు పరిష్కరిస్తారనే నమ్మకం ఉందని పేర్కొన్నారు. సుధాకర్ గెలుపు ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుందన్నారు. పట్టభద్రులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్స్ ఈ విషయాన్ని గుర్తించి ఈ నెల 13న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీతంరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

వైభవుడికి నేడు సుప్రభాత సేవ



వైభవ వేంకటేశ్వరుడు

మురళీనగర్: కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తామన్నారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయని చెప్పారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తామన్నారు. సాయంత్రం 6.30 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు వెంకన్నకు సమర్పిస్తామని, భక్తులు పాల్గొనాలని ఈవో కోరారు.

అలరించిన కర్ణాటక గాత్ర కచేరీ



కీర్తనలు ఆలపిస్తున్న గాయని సులక్షణ

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో శుక్రవారం నిర్వహించిన కర్ణాటక గాత్ర కచేరీ ప్రేక్షకులను అలరించింది. గుడిమెట్ల శారద శిష్యురాలు నడిమింటి సులక్షణ తన మృదు మధుర గానంతో త్యాగరాజ, ముత్తుస్వామి దీక్షితార్ కీర్తనలు ఆలపించి సంగీత లోకంలో విహరింపజేశారు. అభీష్టవరద, పరాకేల సరస్వతి, గురులేక, స్వామినాథ, హరియువతీం, మాయాతీత, బంటురీతి, బ్రోవభారమా, మంగళం, నారాయణతే నమో నమో కీర్తనలు పాడి మైమరపింపజేశారు. కె.శ్రీరామ్ శ్రీనివాస్ వయోలిన్‌పై, టి.ఎస్.చైతన్య మృదంగంపై వాద్య సహకారం అందించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ గాయని సులక్షణను సత్కరించారు.

ఆడారి ఆనంద్‌కుమార్‌కు అభినందనల వెల్లువ



ఆడారి ఆనంద్‌కుమార్‌కు అభినందిస్తున్న పంచకర్ల రమేష్, ఎస్‌ఏ రెహ్మాన్, జియ్యాని



ఆనంద్‌కుమార్‌ను శాలువాతో సత్కరిస్తున్న మహిళా నాయకులు

గోపాలపట్నం: ఆంధ్రప్రదేశ్ మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెష్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన ఆడారి ఆనంద్ కుమార్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. శుక్రవారం పలువురు నాయకులు మర్రిపాలెం వుడాలేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో ఆనంద్‌కుమార్‌ను కలిసి అభినందనలు తెలిపారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు, పశ్చిమ ఎన్నికల పరిశీలకుడు ఎస్‌ఏ రెహ్మాన్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వీరితో పాటు కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, సచివాలయ కన్వీనర్లు, కలిసి అభినందనలు తెలిపారు.

మల్కాపురం: ఏపీ మైక్రో,స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఈ) డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన విశాఖ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌ను పారిశ్రామిక ప్రాంతానికి చెందిన వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కనక మహాలక్ష్మి దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యురాలు మళ్ల ధనలత, వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు డైరెక్టర్లు తోనంగి వెంకటరమణియాదవ్,చుక్క వరలక్ష్మి, సింహాచలం దేవస్థానం ట్రస్టు బోర్డు మెంబర్ శ్రీదేవి వర్మ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం



ఆనంద్‌కు నగదు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ 63వ వార్డు నాయకులు

సింధియా: ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఆనంద్ మహారాణాకు వైఎస్సార్‌సీపీ 63వ వార్డు నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. 63వ వార్డుకు చెందిన ఆనంద్ కాలికి గాయమవడంతో కేజీహెచ్‌లో చేరాడు. వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు ఆపరేషన్ చేసి గాయమైన కాలును తొలగించారు. ఆనంద్ కుటుంబం ఆర్థిక ఇబ్బందులు పడుతున్నవిషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు సోమాదుల సురేష్ శుక్రవారం కేజీహెచ్‌కు వెళ్లి బాధితుడిని పరామర్శించి ఆర్థిక సాయంగా నగదు అందించారు. వార్డు నాయకులు యలగాడ రాజు, అప్పారావు, రవి, రమేష్, శంకర్, భానోజీరావు, నరసింహమూర్తి, నిర్మల, ఆనంద్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

తుది అంకానికి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



మర్రిపాలెం వుడా లేఅవుట్‌లో ప్రచారం చేస్తున్న జియ్యాని శ్రీధర్



అప్పలనర్సయ్య కాలనీలో ప్రచారం చేస్తున్న యతిరాజుల నాగేశ్వరరావు

సింధియా: పట్టభద్రులంతా వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు కోరారు. వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

63వ వార్డులో..

జీవీఎంసీ 63వ వార్డులోని పలు ప్రాంతాల్లో విశాఖ జిల్లా టీడీపీ పార్లమెంటరీ ఉపాధ్యక్షురాలు తోట రత్నం ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. టీడీపీ బలపరిచిన అభ్యర్థి వేపాడ చిరంజీవిరావుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

వార్డుల్లో..

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డులో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆధ్వర్యంలో నాయకులు పట్టభద్రులను కలిసి సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, జియ్యాని మారుతి, దేవి, విజయ, నారాయణమ్మ పాల్గొన్నారు.

● 89వ వార్డు అధ్యక్షుడు దొడ్డి కిరణ్ పలు ప్రాంతాల్లో పట్ట భద్రుల్ని కలిసి సీతంరాజు సుధాకర్‌కు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు.



నమూనా బ్యాలెట్ అందజేస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు



కొత్తపాలెంలో ప్రచారం చేస్తున్న దొడ్డి కిరణ్



63వ వార్డులో కరపత్రం అందిస్తున్న టీడీపీ నాయకులు

దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం



రైల్వేలో ఉత్తమ పనితీరు కనబర్చిన మహిళా ఉద్యోగులతో ఈకార్వో ప్రతినిధులు

● ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి
● ముగిసిన మహిళా దినోత్సవ వారోత్సవాలు

తాటిచెట్లపాలెం: దేశాభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని ఈస్ట్ కోస్ట్ రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) ప్రెసిడెంట్ పారిజాత సత్పతి అన్నారు. తద్వారా సమాజంలో, దేశంలో మహిళా సాధికారత జరుగుతుందని పేర్కొన్నారు. ఈకార్వో వాల్తేర్ ఆధ్వర్యంలో వారం రోజులుగా జరుగుతున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ రోడ్డులోని రైల్ క్లబ్‌లో నిర్వహించిన ముగింపు వేడుకల్లో ముఖ్య అతిథిగా ఆమె ప్రసంగించారు. విధి నిర్వహణలో ప్రతి మహిళా పోషిస్తున్న పాత్రను, అందుకోసం వారిలోని ప్రత్యేకతలను అభివర్ణించారు. రైల్వేలో ఉత్తమ పనితీరు కనబర్చిన సుమారు 50 మంది మహిళా ఉద్యోగులను పారిజాత సత్పతి ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పలువురు మోటివేషనల్ ప్రసంగాలు, ఆరోగ్య సూత్రాలతో మహిళలను ఉత్తేజ పరిచి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈకార్వో వైస్ ప్రెసిడెంట్ మధుస్మిత సాహూ, సెక్రటరీ ప్రియాంక శ్రీదేవి, కోశాధికారి బిదిష చటర్జీ, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

డీఆర్ఎం అభినందనలు..

రైల్వే మహిళా ఉద్యోగులు తమ విధుల్లో ప్రదర్శిస్తున్న అంకితభావం, నిబద్ధతను డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి ఒక ప్రకటనలో అభినందించారు. వాల్తేర్ డివిజన్‌లో మహిళలు(నారిశక్తి) ప్రయాణికుల భద్రత, రైళ్ల నిర్వహణ కోసం లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్లు, ట్రాక్ మెయింటనర్లుగా, లోకో షెడ్‌లో, సిగ్నల్ అండ్ టెలికాంలో, హెల్త్ యూనిట్స్‌లో, ఆర్పీఎఫ్‌లో తమ అద్భుతమైన పనితీరు చూపుతున్నారని ఆయన కొనియాడారు.

డీఈవో సందర్శన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు మాధ్యమం పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు టాబ్స్ వినియోగం, జగనన్న విద్య కానుక కిట్స్ నిర్వహణ, నోట్‌బుక్స్ కరక్షన్, పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న తీరు, తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు డీఈవో స్వయంగా మధ్యాహ్న భోజనం వడ్డించారు. ఏపీవో అప్పలనాయుడు, ఏఎల్ఎస్‌సీవో వి.శైలజ, హెచ్‌ఎం కె.సలోమి, తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో మేము సైతం



కాస్మోటిక్స్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు



కూచిపూడి నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మల్కాపురం: విద్యార్థినులు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలవాలని మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రేమకుమారి పిలుపునిచ్చారు. వివిధ సేవా కార్యక్రమాల కోసం నిధులు సేకరించే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కాలేజీ ఆవరణలో ఫుడ్, కాస్మోటిక్ ఫెస్టివల్ నిర్వహించారు. వివిధ రకాల ఫుడ్ ఐటమ్స్, కాస్మోటిక్స్‌ను ప్రదర్శించారు. వాటిని కొనుగోలు చేసిన వారు ఇచ్చిన నగదును పేదల సేవా కార్యక్రమాలకు వినియోగిస్తామని విద్యార్థినులు తెలిపారు. అనంతరం కళాశాల విద్యార్థినులు కూచిపూడి, జానపద, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలతో ఆహుతులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి, వై.అనసూయాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఓఎన్‌జీసీ విశ్రాంత ఉద్యోగికి డాక్టరేట్



ఉత్తర్వులు స్వీకరిస్తున్న లక్ష్మణరావు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల పరిశోధక విద్యార్థి బయ్యే లక్ష్మణరావుకు డాక్టరేట్ లభించింది. విభాగ విశ్రాంత ఆచార్యుడు డి.సూర్య ప్రకాశరావు పర్యవేక్షణలో ×విమెన్ అగ్రికల్చరల్ లేబర్-పాలసీపర్స్పెక్టివ్స్-ఏ సోషియో లీగల్‌స్టడీ ఇన్ సెలక్టెడ్ డిస్ట్రిక్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్×అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ వరించింది. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను లక్ష్మణరావు స్వీకరించారు. ఓఎన్‌జీసీలో జనరల్ మేనేజర్‌గా పని చేసి పదవీ విరమణ చేసిన లక్ష్మణరావు ఉన్నత విద్యపై ఆసక్తితో డాక్టరేట్ పూర్తి చేశారు.

అడుగంటిన జూ కొలను



జూ కొలనులో అడుగంటిన నీరు

ఆరిలోవ : ఇందిరాగాంధీ జూ పార్కులో కొలను ఎండిపోతోంది. వేసవి ఎండలు రాకముందే ఇక్కడ నీరు ఆవిరైపోయింది. దీంతో అడుగు భాగంలోనే కొద్దిగా నీరు కనిపిస్తుంది. ఇందులో నిండుగా నీరు ఉన్నప్పుడు వన్యప్రాణులతో పాటు ఈ కొలను కూడా సందర్శకులను అలరించేది. ఇందులో చేపల కోసం పక్షులు నిత్యం కొలను చుట్టూ చేరి కిలకిలారావాలతో సందడి చేసేవి. చుట్టూ పచ్చదనం కనువిందు చేసేది. జూ లోపల కొండలపై స్వేచ్ఛగా సంచరించే కనుజులు, జింకలు సాయంత్రం వేళల్లో దాహం తీర్చుకుంటూ.. సేద తీరేది ఇక్కడే. ప్రస్తుతం ఈ కొలనులో నీరు అంతకంతకూ అడుగంటిపోతుండటంతో పక్షులకు, జంతువులకు తాగునీటి ఇక్కట్లు తప్పేలా లేవు. మార్చి రెండో వారానికే ఇలా ఉంటే.. ఎండలు తీవ్రరూపం దాల్చే ఏప్రిల్, మేలో పరిస్థితి మరింత దారుణంగా మారనుంది. దీంతో ఇప్పటి నుంచే వన్యప్రాణుల సంరక్షణకు జూ అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయక తప్పదు.

హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్లు తప్పనిసరి

గోపాలపట్నం: ప్రతి వాహనానికి హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్లు కలిగి ఉండాలని ఉప రవాణా శాఖ కమిషనర్ రాజా రత్నం తెలిపారు. మోటారు వాహనాల నియమాల ప్రకారం నంబర్ ప్లేట్లు ఉండాలన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి వాహనాల రిజిస్ట్రేషన్లపై జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు చేపడతామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాహనాలపై కేసులు నమోదు చేసి, సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ముగిసిన భద్రతా వారోత్సవాలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ శ్రీనివాసరావు

గోపాలపట్నం: నేవెల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లేబొరేటరీలో వారం రోజులుగా నిర్వహించిన భద్రతా వారోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మానసి ఆడిటోరియంలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు.ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పని చేసే ప్రాంతాల్లో భద్రతకు తొలి ప్రాధాన్యమివ్వాలని తెలిపారు. ఇందుకు చేపట్టాల్సిన అంశాలను వివరించారు. అసోసియేట్ డైరెక్టర్ పీవీఎస్ గణేష్ కుమార్ మాట్లాడుతూ ప్రమాదాలు జరగక ముందే జాగ్రత్త వహించాలని సూచించారు. ఎన్‌టీపీసీ విశ్రాంత డిప్యూటీ జనరల్ మేనేజర్ జి. శ్రీనివాసరావు సేఫ్టీ అండ్ రిస్క్ మేనేజ్‌మెంట్ అనే అంశంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఆర్ఐఎన్ఎల్ సీనియర్ మేనేజర్ రుద్రప్ప బిహేవియర్ బేస్డు సేఫ్టీ గురించి వివరించారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త బీవీఎస్ఎస్ కృష్ణకుమార్, సేఫ్టీ విభాగం హెడ్ ఎస్ .రవికుమార్, సేఫ్టీ గ్రూప్ డైరెక్టర్ ఆర్. శ్రీహరి, ప్రభుత్వ పాలటెక్నిక్ కళాశాల నుంచి రామ్‌నాథ్ సెంకర్రి, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కొలువుదీరిన దేవతామూర్తులు



ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న పండితులు, భక్తులు



ప్రత్యేక అలంకరణలో దేవతామూర్తులు

కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెంలో శ్రీరామా సేవా సమాజం(యాదవ్) ఆధ్వర్యంలో నిర్మించి ప్రారంభించిన కోదండ సీతారామ, సంపత్ వేంకటేశ్వర స్వామి, ధనలక్ష్మిదేవి ఆలయాల్లో దేవతామూర్తులు కొలువుదీరారు. శ్రీమాన్ రేజేటి శ్రీరామాచార్యులు నేతృత్వంలో శుక్రవారం విగ్రహాల ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభం ఏర్పాటు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలువురు రాజకీయ నాయకులు, అధికారులు దేవతామూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. 11వ తేదీ శనివారం ఉదయం సీతారాములు, సంపత్ వేంకటేశ్వర స్వామి కల్యాణం ఒకే వేదికపై నిర్వహించనున్నట్లు గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ తెలిపారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రామ, ఉత్సవ కమిటీల సభ్యులు, గ్రామ పెద్దలు ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు



తల్లిదండ్రులకు బాలుడిని అప్పగిస్తున్న సీఐ లూథర్‌బాబు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు జాలరివీధి ప్రాంతానికి చెందిన ప్రసాద్ మధ్యాహ్నం తన ఇంటికి సమీపంలో ఆడుతూ ఆడుతూ హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వరకు వచ్చేశాడు. ఇల్లును గుర్తించలేక ఆ మార్గాన వెళ్లే వారి వంక జాలిగా చూస్తున్నాడు. గంటలు గడుస్తున్నా ఆ బాలుడు అక్కడ నుంచి కదలక పోవడంతో అనుమానం వచ్చిన అక్కడి వారు ఆ బాలుడిని ప్రశ్నించగా తప్పిపోయినట్టు గుర్తించారు. దీంతో మల్కాపురం పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ లూథర్ వచ్చి బాబు ఆ బాలుడితో మాట్లాడి తల్లిదండ్రుల చిరునామా సంపాదించి ఇంటికి తీసుకువెళ్లి బాలుడిని అప్పగించారు. దీంతో బాలుడి తల్లిదండ్రులు సీఐకి కృతజ్ఞతలు తెలిపారు.

అప్పన్నకు బంగారు గొలుసు బహూకరణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నగరంలోని తాటిచెట్లపాలేనికి చెందిన మళ్ల గౌరీ శంకర్ అనే దాత సుమారు 42.730 గ్రాముల బంగారం గొలుసు కానుకగా ఇచ్చారు. ఉదయం స్వామివారి దర్శనానికి వచ్చిన దాత గొలుసును ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ రాంబాబు, సిబ్బంది సాంబ, నాయుడు పాల్గొన్నారు.